సీఎం రిలీఫ్‌ఫండ్‌తో పేదలకు మేలు


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: సీఎం రిలీఫ్‌ఫండ్‌తో అనేక మంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 189 మంది లబ్ధిదారులకు రూ. 70,50,000లను అందజేశారు. కార్పొరేటర్లు బన్నాల గీతాప్రవీణ్, ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి, చేతన, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్‌ఎస్ నేతలు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, ప్రవీణ్‌ముదిరాజ్, గంధం నాగేశ్వర్‌రావు, హనుమంత్‌రెడ్డి, ఆకుల మహేందర్, జితేందర్‌రెడ్డి, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పనులకు సత్వర పరిష్కారం


కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్ : నగర పాలక సంస్థలో అత్యవసర పనులను గుర్తించి వాటికి సత్వర పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 3, 14 డివిజన్‌లలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం స్వచ్ఛదనంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం 11వ డివజన్ పరిధిలోని తిరుమల మెడోస్ కాలనీలోని గుంతలను పూడ్చివేశారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త ప్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


మ్యాన్‌హోల్స్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్ : భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఓల్డ్ మల్లాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల వద్ద జరుగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పనులను కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనులను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. స్థానిక నేతలు కుంటి కృష్ణ, పీఆర్.ప్రవీణ్, రంగా సురేష్‌గౌడ్, రాములునాయక్, చెరుకు నాగరాజుగౌడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

గౌతంనగర్: విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్ బుధవారం గౌతంనగర్ సబ్‌స్టేషన్‌లో ఏడీఈ యాదగిరిని కలిసి కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్‌నగర్, బాలసరస్వతీనగర్, ఐఎన్‌నగర్, ఆనంద్‌బాగ్‌లో నూతన విద్యుత్ పోల్స్‌ను ఏర్పాటు చేయాలని, ప్రమాదకరంగా ఉన్నచోట యాంగులర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఏడీఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.


ఏడీఈతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి



రామంతాపూర్ : ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఫంక్షన్‌హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ భగాయత్ లేఔట్ అభివృద్ధితో పాటు నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి ఆయనకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో స్పోర్ట్స్‌ల నిర్మాణానికి కావాల్సిన స్థలాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లోని 8 ఎకరాల్లో మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కూడా కృషి చేసేలా వెంటనే నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉప్పల్ భగాయత్ రైతుసంఘం అధ్యక్షుడు దుబ్బ నరసింహారెడ్డి, రెసిడెన్షియల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చెరువును పరిరక్షిద్దాం


సఫిల్‌గూడ లేక్‌పార్కు వద్ద మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువును పరిరక్షించుకుందామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సఫిల్‌గూడ చెరువు వద్ద మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మినీ ట్యాంక్‌బండ్‌గా ఉన్న సఫిల్‌గూడ చెరువును పరిరక్షించుకోవడానికి అందరూ ముందుకు రావాలన్నారు. డీసీ రాజు, ఎస్ఎస్ నాగరాజు, ఏఈ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

◆ ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రాజు పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీవాసులకు చెత్త సేకరణకు వచ్చే వారికి సహకరించాలని కోరారు.


ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ జవహర్‌నగర్‌లో..

అకారణంగా వ్యక్తిపై దాడి

● నిందితుడి రిమాండ్

మల్లాపూర్ : నాచారం ఇందిరానగర్‌లో అకారణంగా దాడికి పాల్పడిన వ్యక్తిని నాచారం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం ఇందిరానగర్‌కు చెందిన మహ్మద్ ఫిరోజ్ (34) ప్లంబర్ పని చేస్తాడు. ఈనెల 2న ఇందిరానగర్‌లోని ఖాజా హోటల్ వద్ద పార్క్ చేసిన బైక్‌పై ఫిరోజ్ కూర్చున్నాడు. ఈ క్రమంలో నాచారం బాబానగర్‌కు చెందిన ఎండీ అబ్దుల్ ఫిరోజ్ (20) మద్యంమత్తులో ఉన్నాడు. కాగా అనవసరంగా మహ్మద్ ఫిరోజ్‌ను దుర్భాషలాడుతూ.. తలపై పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా మిర్చి జల్లిగంటతో తలపై బలంగా కొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర రక్తస్రావం కాగా.. మహ్మద్‌ను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

దోమల నివారణకు.. గంబూసియా చేపలు


అల్వాల్ చెరువు వద్ద డీసీ, కార్పొరేటర్ శాంతి

● 'ఫ్రైడే డ్రైడే'లో ప్రజలు భాగస్వామ్యం కావాలని అధికారుల పిలుపు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, నేతలు

అల్వాల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అల్వాల్ సర్కిల్ పరిధిలోని చెరువుల వద్ద దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టారు. బుధవారం అల్వాల్‌లోని చెరువులో 'గంబూసియా' చేపలను డీసీ శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డిలు వదిలిపెట్టారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛదనం – పచ్చదనంలో భాగస్వాములు కావాలన్నారు. కాలనీవాసులు తమ ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అల్వాల్ సర్కిల్ ఏఎంహెచ్ఓ మంజుల, అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ అనిల్‌కుమార్, ఏఎంసీ నర్సింహారెడ్డి, నాయకులు మల్లేష్‌గౌడ్, యాదగిరిగౌడ్, ప్రేమ్‌కుమార్, కాలనీవాసులు హరిబాబు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన

రామంతాపూర్ : ఉప్పల్ డివిజన్ పరిధిలోని శాంతినగర్‌లో బుధవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన దోమల నిర్మూలన అవగాహన కార్యక్రమానికి మందముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దోమల నిర్మూలనలో జీహెచ్‌ఎంసీ అధికారులు చేపడుతున్న పలు చర్యలపై స్థానిక కాలనీ, బస్తీవాసులు కూడా సహకరించి దోమల నిర్మూలనకు తోడ్పడాలని సూచించారు. బస్సులు, కాలనీల్లో నీరు నిల్వ ఉండకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అధికారులతో పాటు బస్తీకాలనీ, సంక్షేమ సంఘం ప్రతినిధులు కూడా భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఉప్పల్ సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ నరేష్‌రెడ్డి, శాంతినగర్ సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

బండ చెరువులో 'నూనె బంతులు'..

మౌలాలి : దోమల నివారణకు తగిన చర్యలు చేపడుతున్నామని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె అధికారులతో కలిసి బండ చెరువులో నూనె బంతులను వదిలారు. 'ఫ్రైడే డ్రైడే' సందర్భంగా దోమల లార్వాలను తినే మస్కిటోఫిష్ అని కూడా పిలువబడే 'గంబూసియా' చేపలను దోమల నియంత్రణకు బేబి పాండ్, బండ చెరువులో వదిలారు. ఏఈ వనజ, కాలనీ అధ్యక్షుడు నరేష్, కాలనీవాసులు గోపాల్, ఉమాకాంత్, బీజేపీ కార్యకర్తలు ఓంప్రకాష్, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.


బండచెరువులో చేపలు వదులుతున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



కుషాయిగూడ: కాలనీ సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి చక్రిపురం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాఘవరెడ్డి వినతిపత్రం అందజేశారు. కాలనీలో తాగునీటి, డ్రైనేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారన్నారు. బీఆర్ఎస్ నేత నేమూరి మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ గీతానగర్‌లో సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యూజీడీ, తాగునీటి పైపులైన్ పనులు పూర్తయిన కాలనీల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. డీఈ మహేష్, ఏఈ దీపక్, వీఐ రమేష్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐలో సూపర్ స్పెషాలిటీ సేవలు

మల్లాపూర్ : నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఈఎస్ఐ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. బుధవారం నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో 9 రకాల సూపర్ స్పెషాలిటీ సేవలను ఈఎస్ఐ డైరెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కీళ్లు, కండరాల వ్యాధులు, ఎండోక్రినాలజీ, గుండె, న్యూరాలజీ, పిడియాట్రిక్ సర్జరీ, నెఫ్రోలజీ, సీటీవీఏ, యూరాలజీ తదితర సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. సనతనగర్ ఈఎస్ఐసీ వైద్య కళాశాల డాక్టర్ శిరీష్, సూపరింటిండెంట్ డాక్టర్ రాధిక, నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కమల, వైద్యులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న నాచారం ఈఎస్ఐ డైరెక్టర్ కృష్ణ ఆదిత్య

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


స్థానికులతో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా : గత ప్రభుత్వ హయాంలో ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్‌తో కలిసి వంపుగూడలో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. గత కొన్నేళ్లుగా డ్రైనేజీ సమస్యలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న ఆయన స్థానిక కార్పొరేటర్‌తో కలిసి కాలనీకి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని ప్రజాపాలనలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఉప్పల్ నియోజవకర్గంలో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. మున్సిపల్ సిబ్బంది, మాజీ మేయర్ పజ్జూరి పావనీరెడ్డి, కాంగ్రెస్ నేతలు సీతారాంరెడ్డి, అంజిరెడ్డి, నాగేషు, ప్రసాద్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీసీతో కార్పొరేటర్ సమీక్ష


డీసీ ముకుంద్‌రెడ్డితో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ : అభివృద్ధి పనులపై కాప్రా సర్కిల్ కార్యాలయంలో డీసీ ముకుంద్‌రెడ్డితో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ సమీక్ష నిర్వహించారు. సాయినగర్‌కాలనీ, కృష్ణారెడ్డినగర్ కాలనీ నుంచి డీమార్ట్ వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపట్టి వర్షాకాలంలో ముంపు బారి నుంచి రక్షణ కల్పించాలని సూచించారు. చర్లపల్లిలోని శ్మశానవాటికలో అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్న అంశాలపై డీసీతో చర్చించి డివిజన్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు.

డివిజన్ సమస్యలు పరిష్కరించాలి..

కాప్రా: చర్లపల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డికి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. బుధవారం కాప్రా సర్కిల్ కార్యాలయంలో డీసీతో సమావేశమై సమస్యలను వివరించారు. వర్షాకాలంలో సాయినగర్, కృష్ణారెడ్డినగర్ కాలనీలు ముంపునకు గురౌతున్నాయని, సమస్యను పరిష్కరించేందుకు కాలనీ నుంచి డీమార్ట్ వరకు బాక్స్‌డ్రైన్ నిర్మించాలని కోరారు. దాదాపు 900 మీటర్ల మేర ఈ పనులు చేపడితే ఆయా కాలనీల్లో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. దీంతో పాటు చర్లపల్లి గ్రేవ్‌యార్డు పనులు కూడా త్వరగా చేపట్టాలని సూచించారు. కాలనీల్లో వీధి దీపాలు, పలుచోట్ల కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ డీసీ దృష్టికి తీసుకెళ్లారు.

పార్క్ చేసిన వాహనాలకు రక్షణ కరువు


ఇందిరానెహ్రూనగర్‌లో ధ్వంసమైన కారు అద్దాలు

గౌతంనగర్ : గౌతంనగర్ డివిజన్ పరిధిలో వాహనాలకు రక్షణ లేకుండా పోతోంది. ఇళ్ల ముందు నిలిపిన వాహనాల అద్దాలు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తున్నారు. ఇటీవల మల్లిఖార్జుననగర్‌లో నాలుగు కార్ల అద్దాలు పగలగొట్టగా.. తాజాగా ఇందిరా నెహ్రూనగర్‌లో రోడ్డుపై పార్క్ చేసిన కారు అద్దాలు సైతం ధ్వసం చేశారు. రాత్రిపూట దుండగులు మద్యం సేవించి సంచరిస్తున్నారని, ఇంటి ఎదుట రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాల అద్దాలు సైతం పగలగొడుతున్నారని కాలనీవాసులు వాపోయారు. దీనిపై సంబంధిత అధికారులు పోలీసుల గస్తీని పెంచి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కారు అద్దాల ధ్వంసం కేసులో నిందితుడి అరెస్ట్


హరికృష్ణ

మల్కాజిగిరి : మల్లికార్జుననగర్‌లో ఇంటి ఎదుట నిలిపిన కారు అద్దాలు పగులగొట్టిన ఘటనలో యువకుడిని మల్కాజిగిరి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... హిల్‌టాప్ కాలనీ చెందిన మూడవ హరికృష్ణ (22) కారు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఈనెల 2న మల్లికార్జుననగర్‌లో కారు అద్దాలు ధ్వంసం చేసిన ఘటనలో అనంతలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేశామని సీఐ తెలిపారు.


గౌతంనగర్‌లోని ప్రధాన రహదారి పక్కన స్వచ్ఛదనం, పచ్చదనం..

వ్యర్థాల తొలగింపు

గౌతంనగర్ : స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని గౌతంనగర్ ప్రధాన రహదారి వద్ద పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందితో కలిసి తొలగించారు. ఎస్ఎఫ్ఏ చిట్టిబాబు, గౌతంనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కిరణ్‌పట్నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

కమిషనర్ అభినందన


పోలీసు సిబ్బందిని అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ ఘటనలో శక్తివచన లేకుండా శ్రమించిన కానిస్టేబుళ్లను బుధవారం రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు అభినందించారు. ఉప్పల్ రింగ్ రోడ్డు చౌరస్తాలోని స్కైవాక్ లిఫ్టులో విద్యార్థులు చిక్కుకుని దాదాపు 40 నిమిషాల పాటు లిఫ్టు డోర్లు పనిచేయకపోవడంతో వారు లోపలే ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా.. సానుకూలంగా స్పందించిన ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు లిఫ్ట్ డోర్‌ను పగులగొట్టి విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. సమన్వయంతో విద్యార్థులను రక్షించిన కానిస్టేబుల్ జాన్సీ, ఇతర కానిస్టేబుళ్లను సీపీ అభినందించి సత్కరించారు. ఏసీపీ ఐటీసెల్ నరేందర్‌గౌడ్, ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి తదితరులు పాల్గొన్నారు.

'టాప్రా' ధర్నాకు సంఘీభావం


మల్కాజిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మల్కాజిగిరి: 'టాప్రా' (తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషియేషన్) ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాకు సంఘీభావంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా నాయకులు ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వయో వృద్ధులైన పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ తీరు సరికాదని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ధర్నా చేపడుతున్నామని, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలన్నారు. నాయుడు, రామేశ్వరరావు, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

పాలకేంద్రంలో చోరీ

● పాల ప్యాకెట్లు ఎత్తుకెళ్తున్న వైనం, కేసు నమోదు

ఉప్పల్ : ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో ఓ పాల కేంద్రంలో గత కొంతకాలంగా పోకిరీలు పాల ప్యాకెట్లను దొంగలిస్తున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాల ప్యాకెట్లను ఎత్తుకెళ్తున్న దృశ్యాలు సీసీ పుటేజీలో రికార్డు కాగా.. దొంగతనానికి పాల్పడుతున్న దుండగుల కోసం సదరు యజమాని మాటువేసి పట్టుకునే ప్రయత్నం చేయగా.. తప్పించుకుని పారిపోయారు. దీంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం


త్రివేణి

మల్కాజిగిరి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతపురి కాలనీకి చెందిన నాగరాజు, త్రివేణి భార్యభర్తలు. కాగా త్రివేణి ఇళ్లల్లో పనిచేస్తే.. భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 5న నాగరాజు డ్యూటీకి వెళ్లి మధ్యాహ్నం తిరిగి ఇంటికొచ్చే సరికి భార్య కనిపించలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని వినతి

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మేడ్చల్ రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ రజనికి బుధవారం వినతి పత్రం అందజేశారు. అంబేడ్కర్ అభయహస్తం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 12 లక్షలు ఇవ్వాలని, ఎస్సీ ఉపకులాలు, మాల, మాదిగ కార్పొరేషన్లకు ఏటా రూ. 750 కోట్లు, దళితుల ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు, ఎస్సీ హాస్టళ్ల నిర్మాణాలకు నిధులు, సబ్సిడీ రుణాలకు నిధులు కేటాయించాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి మహేందర్, మండల అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి

కీసర: ప్రజల అవసరాలకు అనుగుణంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఫ్రైడే మార్కెట్ నుంచి దాయరకుంట వరకు సుమారు రూ. 26 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 20 వార్డుల్లో అవసరమైన చోట డ్రైనేజీలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, మంచి నీటి పైప్‌లైన్ పనులను చేపడతాన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు పంగ హరిబాబు, సుర్వీ శ్రీనివాస్, సుమిత్ర సురేష్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, డీఈ సుదర్శనం, రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం


ఆలయ ప్రధాన ద్వారం నిర్మాణం వద్ద దాతలు

మేడ్చల్ రూరల్: పూడూర్ గ్రామంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన యాటవెల్లి మహిపాల్ రెడ్డి విరాళం అందజేశారు. ఆయన ఆలయ నిర్మాణం ప్రధాన ద్వారం కోసం రూ. 3 లక్షలను నిర్మాణ దారులకు అందజేశారు. గ్రామంలో అందరి కోసం నిర్మిస్తున్న ఆలయం కోసం విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు.

రైతులకు రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులకు రుణాలు పంపిణీ చేశారు. రైతులకు సొసైటీ చైర్మన్ బి.సతీష్ చేతుల మీదుగా దీర్ఘకాలిక పంట రుణాల చెక్కులను అందజేశారు. రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని చైర్మన్ కోరారు.